# లలన పాదం పారిజాతమైంది

భామనే! సత్యభామనే! భామరో! పదియారువేలా కోమలూలందరి లోనా పేరెన్నికగన్న సుందర సుకుమారి సత్యభామ. అలనాడు శ్రీకృష్ణుల వారికి ప్రియ పత్నిగానేకాక ఈనాటికి అఖిల జనావళికి ఆరాధ్యనాయిక సత్యభామ. అందానికి, అందానికి తగ్గ ఠీవికి, ఠీవికి మించి అహంకారపూరిత గర్వానికి ప్రతీకగా 'సత్యభామ'నే పేర్కొంటారు జనం.

ఆ సత్యాకృష్ణుల సయ్యాటల వయ్యారాలు. రాగాల సరాగాల పరాగాలు అందమైన మధురమైన కవితలో ఇంతకంటే చక్కగా చిక్కగా ఇంకెవ్వరూ చెప్పలేరనే రీతిలో చెప్పిన కావ్యం పారిజాతాపహరణం.

ఒకరోజున నారదులవారు దివినుండి భువికి దిగివస్తూ పూరికే రాక పారిజాత ప్రసూనాన్ని తెచ్చాడు. తెచ్చిన పువ్వు ఎవ్వరికో ఇవ్వక నల్లనయ్యకే ఇచ్చి-ఆపై ఊరుకోక అక్కడే నిలబడ్డాడు.

ఆపూవు తీసుకొని రుక్మిణిని చూసినా అయ్యగారి మనస్సులో సాత్రా జతే మెదిలింది. దాంతో కథ అడ్డం తిరుగుతూఉంటే కలహాశనుడు తెలిసిపెట్టిన చిచ్చు రేగుతుందే అనుకొని అక్కడుండి ఇంకెవ్వరికో పంపడం భావ్యం కాదను కొని రుక్మిణికే ఇచ్చాడు. ఆమెధాన్ని జడలో తురుముకుంది. వెంటే చక్క దనానికికాక చక్కదనం, యవ్వనానికికో వింతయవ్వనం వచ్చేశాయావిడకి. ఆ మీదట నారదుడు భట్రాజులా ఆపూవు మహిమ పొగిడి, ఇన్నిదినాలు సవతు లందరిలో సత్యభామ కనుసన్నల్లో వశంవదుడై శ్రీకృష్ణుడు నడుచుకుంటాడని విన్నాను కానీ ఇది అబద్ధం. నువ్వంటేనే ఆయనకి గౌరవం. అయినా చక్కని దాన్నని, ఎలజవ్వనినని-అందరిలో పేరున్న దానినని-భర్త తనకు అనురక్తుడనీ-

గర్వించే సత్యభామ ఈసంగతి విన్నవాళ్ళు కన్నవాళ్ళు చెబితే నిలువునా కుంగి పోతుంది అని చిన్న గుగ్గిలం విసిరి వెళ్ళాడు.

ఇంకేముంది! కొంపలంటు కున్నాయి.

మిగతా ఆరుగురు ఏదోవిధంగా సరిపెట్టుకున్నా-మానవతి సౌందర్య వతి, మహనీయ సౌభాగ్యవతి-సత్యమాత్రం సరిపెట్టుకోలేదు. చెలికత్తె వచ్చి సన్నాయి నొక్కులు నొక్కగానే ఆజ్యంపడ్డ అగ్ని భగ్గుమన్నట్టు, దెబ్బతిన్న నాగుబాము బుస్సుమన్నట్టు "ఏమేమీ! నారదుడు అలా అన్నాడా?" అని "చెవివొగ్గి విన్నాడా ఆయన? ఇంకేం జరిగిందో చెప్పు" అని నిగ్గదీసింది.

అంతా వింది ఆపై కలకాలం ఒక్కరీతిగా పూసలలో దారంలా మదిలో మెదిలే మగవాళ్ళు లభించడం పూర్వజన్మ సుకృతం అనుకుంది. తనతో ఎలా - మెలిగేవాడో తలపోసింది. మగడు ప్రాణ సమానుడు అతడే దైవం - దిక్కు - అలాంటి మగడు దారి తప్పితే కులస్త్రీలకు ఇంకేంగతి అంది ! ధన మిచ్చి పుచ్చుకుంటే ఓర్వవచ్చుకాని మొగడు పరస్త్రీలకి మనసిచ్చి పుచ్చు కుంటే ఎలాబతికేది అనివాపోయింది. వెంటనే కట్టిన చీరవిడిచి మాసిన చీర కట్టుకొని లోపలింట్లో మంచం పట్టి కర్చుకొని లోలోపల కుములుతూ పడుకుంది.

అప్పుడొచ్చాడు అయ్యగారు. చూస్తే వాతావరణం మారిపోయింది. అంతటా నీరవం కొంప మునిగింది పువ్విచ్చిన విషయం ఎవరో చెవిన వేశారు అనుకొంటూ లోపలికి వెళ్ళాడు. ఆపై ఎన్నెన్నో నయగారాలు పలికాడు. ఏందుకు ఆభరణాలు ధరించలేదు ! మంచి గాగరా ఏందుకు తొడగలేదు. ఏమిటి ఈ మౌనం ? ఏల చూడవు ? మాటాడవు ? మెరమెచ్చుల కోసం ఇతర వని తలతో ఏ తీరునో్న మెలిగినా-పాయని అనురక్తి నీమీదే కదా! భామా! నువ్విలా ముద్దివ్వక ముఖం చూపక-లేవకుంటే నేనెలాతాళగలను - అంటూ ఆజగన్నాటక సూత్రధారి ఆమె 'మృదుపల్లవ కోమల పదద్వయికి' ఆర్మిలి మొక్కు మొక్కాడు.

అప్పుడామె

జల జాతాసన వాసవాది సురపూజాభాజ నంబై తన
ర్చు లతాంతాయుధుకన్న తండ్రి శిరమచ్చో వామ పాదంబునన్
దొలగం ద్రోచె లతాంగి అట్లయగు నాథుల్నేరముల్ సేయ పే
రలుకం చెందిన యట్టి కాంతాలుచిత వ్యాపారముల్ నేర్తురే.

అది బ్రహ్మ ఇంద్ర, వరుణాది దేవతలు పూజ్య భావంతో నమస్కరించే శిరస్సు కుసుమశరుడి కన్న తండ్రి శిరస్సు - దాన్ని ఆమె ఎడుమకాలితో తొలగ తోసింది అవును అంతే కదా ! మగడు తప్పు చేస్తే కోపంతో భగ్గున మండే కుల స్త్రీలు ఇంకేం చేస్తారు. అది ఉచితమో అనుచితమో ఆలోచించే అవకాశం ఏక్కడిది ?

తన్నినా తిన్నగానే తన్నిందని ఆ నల్లనయ్య ఆమెపాదం సోకగానే ఒళ్ళంతా పులకరింతలు అయి మదన రాజ్యం లభించినట్టు పొంగి ఆంటారు." నన్ను నీ పాదదాసుని కోపంతో అలిగిన ఆవేశంతో నువ్వు తిన్నగా తన్నినా అదినాకు మన్ననే ! కానీ నాతలతాకి అందమైన చివురాకు సదృశ్యమైన నీ పద పల్లవం నొచ్చిందేమో అని బాధగా ఉంది. సరేలే ! ఇకనైనా కోపం పోయిందా! అన్నాడు నవ్వుతూ.

సత్యభామ అధరం అదరగా-కళ్ళు ఎరుపెక్కగా 'ఈ నయగారాలు-ఈ ప్రియోక్తులు—ఈ మొగమిచ్చు కాలు చాల్లే ! నిన్నే నమ్ముకున్నందుకు మంచి మేలే జరిగింది. అని ముక్క చీవాట్లు పెట్టి బుడి బుడి ఏడ్పులు ఏడ్చింది! ఎలా? పంకజ శ్రీ సఖమైన మోము పయి చేల చేరంగిడి బాల పల్లవ గ్రాస కషాయ కంఠ కలకంఠ వధూకల కాక లీధ్వనిన్ - చక్కనమ్మ చిక్కినా అందంగానే వుందన్నట్లు సత్యభామ ఏడుపు కోకిల కూసినట్టుందట !

ఆమె అలా ఏడిస్తే ఆయన ఆమెని కౌగిట్లోకి తీసుకొని బుజ్జగించి చెక్కిలిమీద జారే కన్నీరు తుడిచి నెయ్యము తియ్యముగా అన్నాడు. పువ్విచ్చానని ఇంతరాద్ధాంతము చేశావు. నీ శుద్ధాంతంలో ఆ పారిజాతాన్నే తెచ్చి చలువ వెద

జల్లు చెంగల్వ కొలని కెలన సరస కర్పూర కదళికా తరుల నడుమ - పెరటి చెట్టుగా నాటిస్తా అని వాటేసుకొని అన్నాడు.

ఇంకేముందీ కథ కంచికి —

ఈ కథను నంది తిమ్మన ఆడుతూ పాడుతూ చెప్పాడు. శ్రీకృష్ణదేవ రాయల వారి ఆస్థానంలో అరణపు కవిగా అమ్మవారి వెంట వచ్చిన తిమ్మన పని గట్టుకొని ఈ కథ ప్రబంధీకరించడానికి ఓ పసందైన కథ చెబుతారు.

అది నిజమో కాదో అని అనుమాన పడే వారికి ఈ తొలి పద్యం అనుమాన నివృత్తి చేస్తుంది.

సరసపుటల్క తీర్చు తరి శార్ఙ్గ సుదర్శన నంద కాబ్జ సం
భరణ గుణాప్తి నెన్నడుముపై కటిపై జడపై గళంబుపై
హరి నలుగేలు పైకొని సుఖంబుగ నిచ్చలు నోలనాడు ఇం
దిర కృప చూచు గాత నరదేవ శిఖామణి కృష్ణరాయనిన్

కృష్ణదేవరాయ వర్ణన కృష్ణవర్ణనకు అభిన్నంగా చేసిన తిమ్మన పకడ్బందీగా ప్రయోజనాన్ని ఆశించే ఈ రచన చేసి ఉంటారు.

అటూ ఇటూ ప్రయోజనాన్ని ఆశించాడు. కాబట్టే ఆంధ్ర ప్రబంధాల్లో పరమ సుకుమార మైందని ప్రజలంతా వేనోళ్ళా నుతించారు....

—o—